సాక్షి కుమురం భీం

శుక్రవారం ౹ 15 ౹ ఆగస్టు ౹ 2025



మద్యానికి దూరం.. చారిగాం

చారిగాం గ్రామస్తులంతా మద్యపాన నిషేధాన్ని కొనసాగిస్తున్నారు. మూడున్నర దశాబ్దాల క్రితం పెద్దలు చేసిన తీర్మానానికి నేటికీ కట్టుబడి ఉన్నారు. IIలో▸



అధ్వానంగా బస్టాండ్లు

తలోడి, ముత్తంపేట, గుండాయిపేట, తదితర గ్రామాల్లోని మినీ బస్టాండ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఎక్కడ చూసినా చెత్తాచెదారంతో దర్శనమిస్తున్నాయి. IIIలో▸

గరిష్టం/కనిష్టం
29.5 /24.8

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. అల్పపీడనం ప్రభావంతో చాలాచోట్ల ఉరుములు, మెరుపులతో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు పంద్రాగస్టు వేడుకలు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్పీ కాంతిలాల్ పాటిల్, అధికారులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో శుక్రవారం పంద్రాగస్టు వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. భారీ వర్షాల నేపథ్యంలో ఈ ఏడాది సమీకృత కలెక్టరేట్ ఆవరణలో వేడుకలు నిర్వహిస్తున్నారు. చెత్తాచెదారం తొలగించి షామియానాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వం తరఫున ముఖ్య అతిథిగా తెలంగాణ శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ హాజరుకానున్నారు. గురువారం కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎస్పీ కాంతిలాల్ పాటిల్‌తోపాటు రెవెన్యూ అధికారులు ఏర్పాట్లను పరిశీలించారు. శుక్రవారం ఉదయం 9.30 గంటలకు పతాకావిష్కరణ, పోలీస్ గౌరవ వందనం స్వీకరణ అనంతరం ముఖ్య అతిథి జిల్లా ప్రగతిపై ప్రసంగించనున్నారు. విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు ప్రదానం చేయనున్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు చేపడతారు. కలెక్టర్ జిల్లా అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. లోటుపాట్లు లేకుండా వేడుకలు విజయవంతం చేయాలని ఆదేశించారు. డీఆర్‌డీవో దత్తారావు, కలెక్టరేట్ ఏఈఓ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

'ఉత్తమ' అవార్డులకు 90 మంది ఎంపిక

ఆసిఫాబాద్: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన జిల్లాలోని 90 మంది ప్రభుత్వ అధికారులు, సిబ్బంది అవార్డులకు ఎంపికయ్యారు. వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన వీరికి శుక్రవారం కలెక్టర్ వెంకటేశ్ దోత్రే చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు ప్రదానం చేయనున్నారు.

ఆదివాసీ హక్కుల కోసం ఉద్యమించాలి



మాట్లాడుతున్న ఎర్మ పున్నం

కాగజ్‌నగర్‌టౌన్: ఆదివాసీ హక్కుల పరిరక్షణకు ఐక్యంగా ఉద్యమించాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్మ పున్నం అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని పద్మశాలి భవనంలో జిల్లా సంఘం అధ్యక్షులు కొరెంగ మాలశ్రీ అధ్యక్షతన గురువారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ముగింపు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులను సైతం ప్రభుత్వాలు హరించివేస్తున్నాయని ఆరోపించారు. అడవులను కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు 2023లో నూతన అటవీ హక్కు చట్టం తీసుకువచ్చారని అన్నారు. తాత్కాలికంగా నిలుపుదల చేసిన జీవో 49ను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీల సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు నెర్పల్లి అశోక్, కోట శ్రీనివాస్, బక్కన్న, శ్యాం, కమల, మడే శశి, సుర్పం రాంచందర్, ఆత్రం చిన్ను, ముంజం ఆనంద్‌కుమార్, జాడి మల్లయ్య, టీకానంద్, కార్తీక్, దుర్గం దినకర్, నంది పద్మ, కూశన రాజన్న, ఊట్ల రవి పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌లో తిరంగా ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే హరీశ్ బాబు


కాగజ్‌నగర్‌టౌన్: రిటైర్డ్ ఆర్మీ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో గురువారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. పెట్రోల్‌పంప్ నుంచి మార్కెట్ వీధుల గుండా సర్‌సిల్క్ మీదుగా పెట్రోల్‌పంప్ ఏరియా వరకు ర్యాలీ కొనసాగింది. ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు మాట్లాడుతూ దేశభక్తిని పెంపొందించడానికి ప్రజల్లో ఐక్యతను చాటడానికి ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. పంద్రాగస్టు సందర్భంగా ప్రతీ ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దోని శ్రీశైలం, జిల్లా మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, అసెంబ్లీ కన్వీనర్ వీరభద్రాచారి, పట్టణ అధ్యక్షుడు శివకుమార్, కోశాధికారి అరుణ లోయ, మండల అధ్యక్షుడు అశోక్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

అవినీతే సమస్య..!

- అందరికీ దక్కని స్వేచ్ఛ–సమానత్వం
- చట్టసభలు, అధికార యంత్రాంగం నిజాయతీగా పని చేయాలి
- అప్పుడే అందరికీ స్వాతంత్య్ర ఫలాలు
- 78ఏళ్ల స్వాతంత్య్ర భారతంపై ప్రజల మనోగతం
- 'సాక్షి' సర్వేలో వెల్లడి

భారతావని స్వాతంత్య్రం సాధించి 78 వసంతాలు పూర్తి చేసుకుని 79వ సంవత్సరంలోకి ప్రవేశిస్తోంది. స్వతంత్ర భారత్ అనేక రంగాల్లో తనదైన ముద్ర వేస్తూ అభివృద్ధి వైపు దూసుకెళ్తోంది. శాస్త్రసాంకేతిక రంగాల నుంచి అంతరిక్షం వరకు ఎన్నో విజయాలు సాధిస్తోంది. స్వతంత్ర భారతంలో ఇన్నేళ్లలో ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య, స్వేచ్ఛ–సమానత్వం, నిజాయతీగా పని చేయాల్సిన రంగాలపై ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని యువత, మహిళలు, పురుషులు 140 మందిని 'సాక్షి' సర్వే చేసింది. ప్రస్తుత సమాజంలో అవినీతి ప్రధాన సమస్యగా మారిందనే అభిప్రాయం వ్యక్తమైంది. అందరికీ స్వేచ్ఛ–సమానత్వం లభించడం లేదని స్పష్టం చేశారు. స్వాతంత్య్ర ఫలాలు అందరికీ దక్కాలంటే చట్టసభలు, అధికారయంత్రాంగం మరింత నీతి, నిజాయతీగా పని చేయాలని సమాధానం ఇచ్చారు.

– కాగజ్‌నగర్‌టౌన్/నిర్మల్‌ఖిల్లా/మంచిర్యాలటౌన్/ఆదిలాబాద్



నవ భారతం నిర్మించుకుందాం

- ప్రపంచాన్ని శాసించే స్థాయికి మన ఆర్థిక వ్యవస్థ ఎదగాలి
- అన్ని దేశాలకు ఇండియా ఆదర్శంగా నిలవాలి
- 'సాక్షి' టాక్‌షోలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినుల మనోగతం



'సాక్షి' టాక్‌షోలో పాల్గొన్న జిల్లా కేంద్రంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు

ఆసిఫాబాద్‌రూరల్: 'పేదరికం, నిరుద్యోగం, నిరక్షరాస్యత, అంటరానితనం రూపుమాపి, 2047 నాటికి నవ భారతం నిర్మించుకుందాం. ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఒకటైన ఇండియా ప్రపంచాన్ని శాసించేస్థాయికి ఎదగాలి. ప్రజల జీవన ప్రమాణాలు పెరగాలి' అంటూ జిల్లా కేంద్రంలోని మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు అభిప్రాయపడ్డారు. 1947 ఆగస్టు 15న స్వాతంత్య్రం పొందిన భారతదేశం సమగ్రాభివృద్ధి దిశగా అడుగులు వేస్తోంది. నేడు(శుక్రవారం) 79వ స్వాతంత్య్ర దినోత్సవం జరుపుకోనున్నాం. ఈ నేపథ్యంలో 2047 నాటికి వందేళ్ల స్వతంత్ర భారతదేశం ఏ విధంగా ఉండాలనే అంశంపై గురువారం జిల్లా కేంద్రంలోని మహిళా డిగ్రీ కళాశాలలో 'సాక్షి' టాక్‌షో నిర్వహించింది. స్వేచ్ఛను పొంది వందేళ్లు పూర్తయ్యే నాటికి ఆర్థిక, సాంఘిక వెనుకబాటు పూర్తిగా తొలగిపోయి, నవ భారతంలోకి భవిష్యత్తు తరాలు అడుగు పెట్టాలని విద్యార్థినులు ఆకాంక్షించారు.

ఉచిత విద్య అందాలి



2047 నాటికి దేశంలో ప్రతీ విద్యార్థికి కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వమే ఉచితంగా విద్య అందించే వ్యవస్థను తీసుకురావాలి. ప్రస్తుతం నిరుపేదలు ఉన్నత విద్యను అభ్యసించకపోతున్నారు. ఉన్నత విద్య వ్యవస్థ మరింత సరళంగా మారాలి. విద్యార్థి కేంద్రీకృతంగా అభివృద్ధి జరగాలి. ఆధునిక అవసరాలకు అనుగుణంగా వ్యవస్థలు తీర్చిదిద్దాలి.

– రేణుక, ఎంపీసీఎస్ ఫైనలియర్

రైతులే ధర నిర్ణయించాలి



రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర దక్కడం లేదు. భవిష్యత్తులో రైతులే పంట ఉత్పత్తులకు ధర నిర్ణయించుకుని మార్కెట్‌లో విక్రయించుకునే హక్కు ఉండాలి. ప్రస్తుతం ప్రైవేట్ కంపెనీలు తయారు చేసిన వస్తువులకు ధర నిర్ణయించుకుంటున్నాయి. ఆ విధంగా పంటలకు పెట్టుబడి ఆధారంగా ధర లేకపోవడంతో అన్నదాతలు ఆత్మహత్య చేసుకుంటున్నారు. ధర నిర్ణయం హక్కు రైతులకే ఉండాలి.

– అనురాధ, ఎంపీసీఎస్ ఫైనలియర్

ఆర్థిక వ్యవస్థ పటిష్టం కావాలి



మనల్ని పాలించిన బ్రిటిష్ ఆర్థిక వ్యవస్థను తలదన్నే రీతిలో దేశ ఆర్థిక వ్యవస్థ రూపుదిద్దుకుంటుంది. ఇటీవల అమెరికా విధిస్తున్న టారిఫ్‌లతో ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయి. రానున్న కాలంలో దేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచాన్ని శాసించే స్థాయికి ఎదగాలి.

– చైతన్య కుమారి, అధ్యాపకురాలు

పరిపాలన మారాలి



ప్రజల అవసరాలకు అనుగుణంగా పరిపాలన విధానం మారాలి. అవినీతి లేకుండా సమర్థవంతమైన ప్రజా పాలన ఉండాలి. పోలీస్, న్యాయ వ్యవస్థలో మార్పు రావాలి. మహిళా చట్టాల ఉన్నప్పటికీ సక్రమంగా అమలు కావడం లేదు. స్వతంత్ర భారతదేశంలో మహిళలకు రక్షణ లేకుండాపోయింది. తప్పు చేసిన వారికి గంటల్లో శిక్ష పడేలా చట్టాలు అందుబాటులోకి రావాలి.

– శారద, ప్రిన్సిపాల్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల

నాణ్యమైన వైద్యం ఉచితంగా అందాలి



ప్రభుత్వ ఆస్పత్రుల్లో పేదలకు నాణ్యమైన వైద్యం అందడం లేదు. జిల్లాకు ఒక పెద్ద ప్రభుత్వ ఆస్పత్రి ఉంటే వందలాది ప్రైవేట్ హాస్పిటల్స్ వెలుస్తున్నాయి. పేదలను వైద్యం పేరుతో దోచుకుంటున్నాయి. ఈ పరిస్థితి మారాలి. పేదలకు ప్రభుత్వమే ఉచితంగా నాణ్యమైన వైద్యం అందించే పరిస్థితి రావాలి.

– అనూష, బీకాం ఫస్టియర్

మహిళలకు రక్షణ లేదు



స్వాతంత్య్రం వచ్చి ఏళ్లు గడుస్తున్నా దేశంలో మహిళలకు రక్షణ లేదు. చిన్నారుల పైనా లైంగిక దాడులు పెరిగాయి. చట్టాలు ఉన్నా సకాలంలో న్యాయం జరగడం లేదు. భవిష్యత్తులో ఈ పరిస్థితి మారాలి. చట్టాలు మరింత కఠినతరం చేయాలి. మహిళలకు రక్షణ కల్పించాలి.

– జ్యోతి, ఎంపీసీఎస్ ఫైనలియర్

విద్య, వైద్యం అందుబాటులో ఉండాలి



పాలకులు ప్రజల యోగా క్షేమాల గురించి ఆలోచించేవారై ఉండాలి. టెక్నాలజీ అనేది దేశ పురోగతికి మూల స్తంభం. విద్య, వైద్యం ప్రజలకు ఉచితంగా అందుబాటులో ఉండాలి. రక్త సంబంధాలు కూడా మరిచి, అమానుష ఘటనలకు పాల్పడుతున్నారు. అలాంటి వారికి కఠిన శిక్షలు విధించాలి.

– టీనా, ఎంబీజెడ్‌సీ సెకండియర్

ఏఐ రంగంలో మరింత పురోగతి



ఆధునిక ఇండియాకు అన్నిరంగాల్లో సాంకేతికత అవసరం ఉంటుంది. అందుకు అనుగుణంగా ప్రభుత్వ విద్యా వ్యవస్థల్లో సాంకేతిక విద్యను ప్రోత్సహించాలి. 2047 నాటికి మరింత పరిజ్ఞానం, పరిశోధనలు పెరుగుతాయి. కృత్రిమ మేధ(ఏఐ) రంగంలోనూ మరింత పురోగతి సాధించాల్సిన అవసరం ఉంది.

– మహేశ్వరి, ఎంపీసీఎస్ ఫైనలియర్

రాజకీయాల్లో మార్పు అవసరం



ఎన్నికల్లో అమలు వీలుకాని హామీలు, ఉచిత పథకాలతో రాజకీయ పార్టీలు అప్పులు చేస్తున్నాయి. భవిష్యత్తు తరాలకు మెరుగైన జీవనం ఉండాలంటే రాజకీయాల్లో పూర్తిస్థాయిలో మార్పు అవసరం. రాజకీయ పార్టీలు ఇచ్చే హామీలపై ప్రశ్నించే హక్కు ఉండాలి. రాజకీయ రంగంలో యువత, మహిళలను ప్రోత్సహించాలి.

– అనూష, బీఏ ఫైనలియర్

'గిరి' పల్లెల్లో ఫోన్ సిగ్నలేది..?



నేటికీ గిరిజన పల్లెల్లో కనీసం సెల్‌ఫోన్లకు పూర్తిస్థాయిలో సిగ్నల్ అందడం లేదు. బాహ్య ప్రపంచానికి దూరంగా గిరిజనులు బతుకుతున్నారు. వందేళ్ల స్వతంత్ర భారతంలో ప్రతీ ఆదివాసీ గూడేనికి టెక్నాలజీ అందాలి. సాంకేతికత గిరిజనులకు అందాలి.

– సుహాసిని, ఎంబీజెడ్‌సీ ఫైనలియర్

'బంగారు తెలంగాణ'గా మారాలి



కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి. సాగు నీటి వనరులు పెరిగి రైతులపై అప్పుల భారం తగ్గాలి. ఏళ్లుగా దోపిడీ గురైన తెలంగాణ ప్రజలకు ఉన్నత చదువులు ఉచితంగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. రాష్ట్రం బంగారు తెలంగాణగా మారాలి.

– సోనాలి, ఎంబీజెడ్‌సీ సెకండియర్

ఆందోళనలతో సమస్య మరింత జటిలం

- ఎమ్మెల్సీ దండె విఠల్

కాగజ్‌నగర్‌టౌన్: విపక్ష నాయకులు రాజకీయంగా లబ్ధి పొందేందుకు ఆందోళనలు, ధర్నాలు, పాదయాత్రలు చేసేలా పోడు రైతులను ప్రోత్సహిస్తున్నారని, తద్వారా పోడు భూముల సమస్య మరింత జటిలం అవుతుందని ఎమ్మెల్సీ దండె విఠల్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఆర్వోఎఫ్‌ఆర్ చట్టంతో గిరిజనేతరులకు హక్కులు కల్పించే అవకాశం లేదని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని సామాన్య రైతులకు తెలియజెప్పాల్సిన నాయకులు బాధ్యత మరిచి వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రజా ప్రభుత్వంలో పోడు భూముల రైతులకు మేలు చేసేందుకు నిబద్ధతతో కృషి చేస్తున్నామని తెలిపారు. సిర్పూర్(టి) మండలం ఇటిక్యాలపహాడ్ రైతుల సమస్యను సామరస్యంగా పరిష్కరించామని పేర్కొన్నారు. దిందా గ్రామ పోడు భూముల రైతులకు మేలు చేసేందుకు అటవీ శాఖను ఒప్పించామని తెలిపారు. ఒక్కొక్కరికి మూడెకరాల భూమి ఇచ్చేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఈ సమయంలో కొందరు పెద్ద రైతులను ప్రేరేపించి ప్రభుత్వాన్ని బద్నాం చేసేలా పాదయాత్రలు చేయించడం సరికాదన్నారు. గత ప్రభుత్వ హయాంలో సార్సాల, కొండపల్లి గ్రామాల్లో జరిగిన పోడు గొడవల్లో అమాయక రైతుల మీద కేసులయ్యాయని గుర్తు చేశారు.

చర్చలు సఫలం.. సమ్మె వాయిదా



సూపరింటెండెంట్ ప్రవీణ్‌తో చర్చలు జరుపుతున్న నాయకులు, కార్మికులు

ఆసిఫాబాద్‌అర్బన్: పెండింగ్ వేతనాలు చెల్లించడంతోపాటు మూడేళ్ల ఈపీఎఫ్, ఈఎస్ఐ వివరాలు వెల్లడించాలని ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బంది ఏఐటీయూసీ, సీఐటీయూసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో మూడు రోజులుగా నిరసన తెలుపుతున్న విషయం తెలిసిందే. గురువారం ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రవీణ్ వారితో చర్చలు జరిపారు. చర్చలు సఫలం కావడంతో సమ్మె వాయిదా వేస్తున్నట్లు నాయకులు ప్రకటించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు చిరంజీవి, సీఐటీయూ నాయకులు శ్రీకాంత్, ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు కేశవ్, బీజేపీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు జయరాజ్ మాట్లాడారు. ఈ నెల 24లోగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

'దిందా' రైతుల అరెస్టు

కాగజ్‌నగర్‌టౌన్/చింతలమానెపల్లి/కౌటాల/వాంకిడి: పోడు భూములపై హక్కుల కోసం ఈ నెల 6న హైదరాబాద్‌కు పాదయాత్ర చేపట్టిన చింతలమానెపల్లి మండలం దిందా గ్రామ రైతులను గురువారం పోలీసులు అరెస్టు చేయడం ఉద్రిక్తతకు దారి తీసింది. రైతులు రాజధానికి చేరుకునే క్రమంలో పోలీసులు అదుపులోకి తీసుకుని అల్వాల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్కడి నుంచి దిందాకు తీసుకువస్తుండగా వారి బస్సును కాగజ్‌నగర్ మండలం కోసిని వద్ద బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, నాయకులు అడ్డుకున్నారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. పోడు రైతులకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. సీఐ ప్రేంకుమార్, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను అరెస్టు చేసి కౌటాల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఐదు గంటలపాటు స్టేషన్‌లో ఉంచి విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డికి దిందా రైతుల ఉసురు తాకుతుందన్నారు. అక్రమ అరెస్టులతో అన్నదాతలను అణిచివేయాలని చూస్తే ఊరుకోమని హెచ్చరించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ఫారెస్ట్ క్యాంప్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. నాయకులు దాసరి ఉష, విశ్వనాథ్, లెండుగురే శ్యాంరావు, నాందేవ్, బండు, హర్షద్‌హుస్సేన్ తదితరులు ఉన్నారు.



వాంకిడి పోలీస్‌స్టేషన్ ఎదుట మాట్లాడుతున్న దిందా గ్రామ రైతులు



ప్రవీణ్‌కుమార్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు

గ్రామస్తులను అడ్డుకున్న పోలీసులు

పాదయాత్రగా వెళ్లిన రైతులకు మద్దతు తెలిపేందుకు పలువురు దిందా గ్రామస్తులు బయలుదేరగా పోలీసులు అడ్డుకున్నారు. గ్రామ శివారులో ఎస్సై ఇస్లావత్ నరేశ్ ఆధ్వర్యంలో పోలీసుల అడ్డుకొని వారిని సముదాయించారు.

న్యాయం జరిగేవరకు పోరాడుతాం..

న్యాయం జరిగేవరకు పోరాడుతామని చింతలమానెపల్లి మండలం దిందాకు చెందిన పోడు రైతులు అన్నారు. వాంకిడి పోలీస్‌స్టేషన్‌లో వారు మాట్లాడారు. దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న భూములకు అటవీ శాఖ అధికారులు కంచెలు ఏర్పాటు చేశారని, వ్యవసాయ పనులకు వెళ్తే అడ్డుకుంటున్నారని ఆరోపించారు. భూములు తమకు అప్పగించాలని కోరేందుకు సుమారు 60 మంది పాదయాత్రగా హైదరాబాద్ బాట పట్టినట్లు తెలిపారు. వాంకిడి పోలీస్ స్టేషన్‌కు సుమారు 20 మంది రైతులను తరలించగా మిగిలిన వారిని కాగజ్‌నగర్, రెబ్బెన పోలీస్ స్టేషన్లకు తరలించినట్లు సమాచారం.

నవోదయ పీఈటీ విజయనగరంలో మృతి


ప్రదీప్ (ఫైల్)

కాగజ్‌నగర్‌టౌన్: జవహర్ నవోదయ విద్యాలయంలో పీఈటీగా విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు ప్రదీప్ (31) గురువారం మృతి చెందాడు. ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లాలో జూలై 27 నుంచి ఆగస్టు 28 వరకు నిర్వహించ తలపెట్టిన జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు కోచ్‌గా కాగజ్‌నగర్ నవోదయ విద్యాలయం నుంచి వెళ్లాడు. గురువారం మధ్యాహ్నం భోజనం అనంతరం గుండెపోటు రావడంతో ఒక్కసారిగా కుప్పకూలాడు. వెంటనే వైద్య సహాయం అందించినప్పటికీ ఫలితం లేకపోయిందని ప్రిన్సిపాల్ రేపాల కృష్ణ తెలిపారు. పీఈటీ మృతితో విద్యాలయం ఉపాధ్యాయులు, సిబ్బంది విజయనగరం బయలు దేరారు.

నేడు బెల్లంపల్లిలో ఉమ్మడి జిల్లా మహాసభ

బెల్లంపల్లి: తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ (టీహెచ్‌డబ్ల్యూ) ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మహాసభను శుక్రవారం బెల్లంపల్లిలోని అగర్వాల్ భవన్‌లో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గెల్లి రాజలింగు తెలిపారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుంటి సామ్రాజ్యం ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నట్లు ఆయన పేర్కొన్నారు. 21 విభాగాల్లో పని చేస్తున్న హమాలీలు పాల్గొంటారని, సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ తయారు చేయనున్నట్లు తెలిపారు.

మద్యానికి దూరం.. చారిగాం

అదో మారుమూల కుగ్రామం. ఆ గ్రామంలో అందరి జీవనాధారం వ్యవసాయమే. ప్రతీరోజు ఉదయాన్నే నిద్రలేచి ఆహ్లాదకరమైన వాతావరణంలో వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతారు. మహాత్మాగాంధీ సూచనలు నమ్మిన కాగజ్‌నగర్ మండలంలోని చారిగాం గ్రామస్తులు మద్యపాన నిషేధాన్ని పాటిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.


చారిగాం గ్రామం

- మూడున్నర దశాబ్దాల క్రితం పెద్దల తీర్మానం
- ఇప్పటికీ కట్టుబాటు పాటిస్తున్న గ్రామం

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణానికి ఐదు కిలోమీటర్ల దూరంలో చారిగాం గ్రామం ఉంది. ఈ గ్రామంలో 234 మంది జనాభా, 112 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. వారంతా మద్యపాన నిషే. దానికి కట్టుబడి ఉంటున్నారు. గ్రామంలో గుడుంబా తయారీ, బెల్టుషాపుల ఏర్పాటు చేయవద్దని మూడున్నర దశాబ్దాల క్రితమే పెద్దలు తీర్మాణించారు. ఇప్పటికీ అవే ఆచారాలను పాటిస్తున్నారు. గ్రామంలో అన్నీ వ్యవసాయ కుటుంబాలే. ప్రధానంగా కూరగాయాలు సాగుచేసి పట్టణంలోని మార్కెట్‌లో విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. 35 ఏళ్లుగా గ్రామస్తులు మద్యపాన నిషేధం పాటిస్తున్నారు. స్థానిక యువత బయట తాగినట్లు తెలిస్తే ఆంజనేయస్వామి ఆలయానికి తీసుకెళ్లి వారిచే మాలధారణ చేయిస్తున్నారు. మరోసారి మద్యం జోలికి వెళ్లకుండా వారికి అవగాహన కల్పిస్తున్నారు. గ్రామంలో అందరూ కలిసిమెలిసి ఉంటారు. ఎలాంటి గొడవలు, అల్లర్లకు తావులేకుండా మంచి నడవడికతో ఉంటున్నారు.

ఆచారం ఇప్పటికీ కొనసాగుతోంది



మా తాతల కాలం నుంచి గ్రామంలో ఎవరూ మద్యం సేవించరు. అదే ఆచారం ఇప్పటి వరకూ కొనసాగుతోంది. గ్రామంలో అందరం కలిసి మెలిసి ఉంటాం. ఏ సమస్య వచ్చినా ఇక్కడే అందరం కలిసి పరిష్కరించుకుంటాం. ఆంజనేయ స్వామి గుడిలో పూజలు నిర్వహిస్తాం. అందరం కలిసి పండుగలు ఆనందంగా జరుపుకుంటాం.

– మొర్ల పోచయ్య, చారిగాం

స్నేహభావంతో ఉంటాం



గ్రామంలోని యువకులమంతా కలిసి మెలిసి స్నేహభావంతో ఉంటాం. గ్రామంలో ఏమైనా సమస్య ఉంటే యువకులమంతా ఒకేచోట చేరి పరిష్కరించుకుంటాం. గ్రామంలో ఎవరూ మద్యం సేవించరు. బెల్టుషాపులు పెట్టరు. ఇదే ఆచారాన్ని అందరం పాటిస్తాం.

– మొర్ల శంకర్, చారిగాం

స్వచ్ఛతలో మేటి 'దేవునిగూడ'


దేవునిగూడ గ్రామ పంచాయతీ కార్యాలయం

- రెండుసార్లు ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎంపిక
- కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు స్వీకరణ

జన్నారం: దేశానికి పల్లెలే పట్టుకొమ్మలని, గ్రామాలు పచ్చదనంతో ఉంటేనే రాష్ట్రం, దేశం బాగుంటుందని చెబుతారు. గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రతే ధ్యేయంగా ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు చేపడుతున్నాయి. ఇందులో భాగంగా పరిశుభ్రం, పచ్చదనంతో పాటు ప్రభుత్వ కార్యక్రమాలు అమలు చేయడంలో ముందుండడమే కాకుండా ఉత్తమ గ్రామ పంచాయతీగా రెండుసార్లు ఎంపికై ంది. సర్పంచ్, కార్యదర్శులు కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. అదే జన్నారం మండలంలోని దేవునిగూడ.

పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి

దేవునిగూడ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ గుర్రం శిరీష, కార్యదర్శి సరిత ప్రభుత్వ కార్యక్రమాలు అమలు చేయడంతో పాటుగా హరితహారం, పరిశుభ్రత కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించారు. డ్రెయినేజీలు శుభ్రం చేయించడం, మురుగు నీరు రోడ్లపై పారకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. రోడ్లుకు ఇరువైపులా మొక్కలు నాటి సంరక్షణ బాధ్యతలు చేపట్టారు. పల్లె ప్రకృతి వనం, శ్మశాన వాటిక, డంపింగ్ యార్డుల నిర్వహణ సక్రమంగా ఉంచారు. పలుమార్లు ఈ గ్రామాన్ని సందర్శించిన ఉన్నతాధికారులు పంచాయతీ పాలకవర్గం పనితీరుపై ప్రశంసలు కురిపించారు. ఇందులో భాగంగా 2022 ఆగస్టు 15న అప్పటి సర్పంచ్ శిరీష, కార్యదర్శి సరిత కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డు అందుకున్నారు.

ఇళ్లపై త్రివర్ణ పతాకం ఆవిష్కరించాలి

చెన్నూర్: ప్రతి ఒక్కరూ ఇళ్లపై త్రివర్ణ పతాకాలను ఆవిష్కరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. హర్ ఘర్ తిరంగలో భాగంగా గురువారం చెన్నూర్ పట్టణంలోని జలాల్ పెట్రోల్ బంక్ నుంచి ప్రధాన వీధుల్లో జాతీయ పతాకాలతో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో ఆపరేషన్ సింధూర్ విజయవంతమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్, పట్టణ అధ్యక్షుడు తుమ్మ శ్రీపాల్, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సమ్మయ్య, కేవీఎం శ్రీనివాస్, తిరంగా ర్యాలీ కన్వీనర్ శివకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన సబ్ కలెక్టర్

భీమిని: భారీ వర్షాలకు ముంపునకు గురైన పంటలను బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ గురువారం పరిశీలించారు. భీమిని, కన్నెపల్లి మండలాల్లో పర్యటించి రైతులతో మాట్లాడారు. పంట పొలాల్లో చేరిన నీటిని సాధ్యమైనంత వరకు త్వరగా బయటకు పంపించాలని సూచించారు. రాబోయే రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. పంటల నష్టం అంచనావేసి పంపించాలని అధికారులను ఆదేశించారు. చిన్నతిమ్మపూర్, తంగేళ్లపల్లి గ్రామాల మధ్యలో వంతెన లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తహసీల్దార్లు బికార్ణదాస్, శ్రవణ్‌కుమార్, ఏఈవోలు పాల్గొన్నారు.

సొసైటీ పాలకవర్గాల గడువు పొడిగింపు

కైలాస్‌నగర్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు(పీఏసీఎస్)ల పాలకవర్గాల గడువును రాష్ట్ర ప్రభుత్వం మరోసారి పొడిగించింది. గురువారంతో వీటి కాల పరిమితి ముగియగా మరో ఆరు నెలల పాటు సొసైటీ, డీసీసీబీ చైర్మన్ల పదవీకాలం పొడిగిస్తూ రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖల ప్రభుత్వ కార్యదర్శి ఎం.రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై సొసైటీ చైర్మన్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్ అడ్డి భోజారెడ్డి గురువారం సీఎం రేవంత్ రెడ్డిని హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. సచివాలయంలో ఆయనను కలిసి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

మంచిర్యాలఅగ్రికల్చర్: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అదనపు కలెక్టర్ పి.చంద్రయ్యకు వినతిపత్రం అందజేశారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు మాట్లాడుతూ వేతనాలు పెంచడంతోపాటు ఫేస్ క్యాప్చర్ విధానం రద్దు చేయాలని, వివిధ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కలిందర్‌అలీఖాన్ పాల్గొన్నారు.